కన్సల్టెంట్ పోస్టు భర్తీకి చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

వైద్య, ఆరోగ్య శాఖలో క్వాలిటీ మోనిటరింగ్ విభాగంలో జిల్లా కన్సల్టెంట్ పోస్టును కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిపై నియామకానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. భర్తీ మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 20 నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చు అన్నారు. దరఖాస్తు నమూనా, అర్హతల వివరాలు https://parvathipurammanyam.ap.gov.in వెబ్-సైట్‌లో పొందుపర్చినట్టు చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులు పార్వతీపురం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈనెల 25న సాయంత్రం 5 గంటల్లోగా సమర్పించాలని ఆయన తెలిపారు.

ఎండిపోతున్న చేలు...

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వరి సాగు ఎంతో ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులకు ఈఏడాది వర్షాలు అనుకూలించకపోవడం, సాగునీటి వనరులు అందుబాటులో లేక తమ కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ పంటపొలాల్లోకి పశువులను తొలేస్తున్న దయానీయమైన పరిస్థితి ఎక్కడికక్కడే కనబడుతుంది. మండలంలోని ఎమ్మార్ నగరంలో రొంపిల్లి జగన్నాధం అనే రైతు ఎండిన చేలను కళ్లతో చూడలేక దగ్గర ఉండి మరీ పశువులను పొలాల్లో తోలి వాటికి మేతగా వేశారు. మండలంలో 18వేల ఎకరాల్లో వరి సాగుకు అనువైనప్పటికీ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఈ ఏడాది కేవలం 15వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. దాదాపు 2వేల ఎకరాల వరకూ రైతులు వెదజల్లే పద్ధతిలో విత్తనాలు జల్లుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌సీజన్ ప్రారంభం నాటి నుంచి వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ సెప్టెంబర్ మొదటివారం నుండి మూడో వారం వరకూ ఎడతెరపిలేకుండా కురిసిన వానలకు రైతులు ఎంతో ఆశతో వరిసాగును కొనసాగించారు. కాస్త ఆలస్యంగానైనా ఉభాలు కొనసాగించారు. అయితే సెప్టెంబర్ శివారు వారం నుంచి ఇప్పటికీ చినుకుల జాడలేకపోవడంతో తమ పంటలను కాపాడుకోలేక రైతులు చేతులు ఎత్తేశారు. నీటివనరులు ఉన్న రైతులు దిగుబడికి మించి ఖర్చు చేస్తూ డీజల్ ఇంజన్లతో దూరాబారాల నుంచి నీళ్లు తోడించుకుంటున్నారు. చెరువుల కింద, ఆయకట్ట రైతులు ఆ మాత్రం నీటితడులు ఇచ్చి పంటను రక్షించుకున్నప్పటికీ దాదాపు 30 శాతం మంది రైతుల పొలాలకు నీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితిపై వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలు ప్రకారం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడం కుదరదని, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు అనుకూలించక పోవడంతో పంటలు ఎండిపోవడమన్నది యధార్థమని, మండలంలో దాదాపు 92శాతం ఇ-క్రాప్ నమోదైనందున నష్టపోయిన భూముల వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. తప్పకుండా వాటికి పరిహారం అందించి తగు న్యాయం చేస్తామంటున్నారు. ఈ ఏడాది అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని మండలానికి జీవాధారమైన జంఝావతి ఎగువకాలువ, అడారు ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులను ఆదుకోకపోతే భవిష్యత్తులో రైతాంగం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు చూడాల్సి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశువుల మేతకు వరిపంట

ఎండిపోయిన వరి పంటను పశువులతో మేపిస్తున్న రైతు

జిల్లాలో యువకులకు, పెద్దలకు, మహిళలకు అందరికీ క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. 12 ఏళ్ల అనంతరం భారత్ జట్టు క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరుకోవడం, ఆదివారం ఆసీస్‌తో తలపడనుండడంతో అందరిలోనూ ఒకటే టెన్షన్. వరుస విజయాలతో ఫైనల్‌కు చేరిన భారత్‌జట్టు ఆస్ట్రేలియా జట్టును ఓడించి 2003 నాటి ప్రతీకారాన్ని తీర్చుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం మధ్యాహ్నం నుంచి టివిలకు, నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఇడి స్క్రీన్లకు అతుక్కుపోయేందుకు సిద్ధమైపోయారు. ఎక్కడ చూసినా క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కోసం చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఎప్పుడొస్తుందా అని ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు ఎదురు చూస్తున్నారు.

క్రికెట్ ఫీవర్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ప్రస్తుతం ఎక్కడ చూసినా క్రికెట్ ఫీవర్ కనిపిస్తోంది. ఎవరి నోట విన్నా 'ప్రపంచ కప్ విన్నర్ భారత్' అంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఇండియా, న్యూజిలాండ్ క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగగా, క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోయి మ్యాచ్‌ను వీక్షించిన దృశ్యాలు కనిపించాయి. ఎన్నడూ లేని రీతిలో ఈసారి ప్రపంచకప్‌లో ఇండియా క్రికెట్ టీం అన్ని విజయాలను అందుకోవడంతో క్రికెట్ అభిమానుల్లో ఆనందాలకు అవధులు లేవు. సెమీ ఫైనల్‌లో ఇండియా జట్టు గెలిచిన వెంటనే జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆస్ట్రేలియాతో జరిగే ఫైనల్ కోసం జిల్లా వ్యాప్తంగా అందరూ ఎదురు చూస్తున్నారు. ఇండియా జట్టు ప్రపంచ కప్‌ను ఒడిసిపట్టాలని ఆకాంక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని నాలుగురోడ్ల కూలి బందవారి వీధిజంక్షన్‌లో బిగ్‌స్కీన్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన అభిమానులు సన్నద్ధమవుతున్నారు. అలాగే బెలగాంతో పాటు పలు వార్డుల్లో అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై సంబంధిత శాఖలతో స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు జాతీయ లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. జాతీయ లోక్‌అదాలత్‌లో వెలువరించి తీర్పులకు పరిపూర్ణత ఉందన్నారు. రాజీ మార్గంలో పరిష్కారం జరుగుతుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులంతా ఉపయోగించుకొని సాధ్యమైనంత వరకు కేసులు తగ్గించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు, పార్వతీపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బిసిచ్ స్వామినాయుడు, ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, న్యాయవాదులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికై

30న చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బలిజిపేట

జిల్లాలో విద్యా రంగ సమస్యలపై ఈనెల 30న చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పిఎస్ఎన్ కళాశాలలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన, పేద, మధ్యతరగతి యువతకు, విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని వాపోయారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 70వేల మంది విద్యార్థులు జిల్లాలో ఉన్నత చదువుల నిమిత్తం విద్యాసంస్థల్లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యా విధానాన్ని దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదని, ఒక్క మన రాష్ట్ర ప్రభుత్వమే వేగంగా అమలు చేయడం దౌర్భాగ్యమని అన్నారు. రాష్ట్ర విభజన సమయంలో జిల్లాకు మెడికల్, ఇంజనీరింగ్, యూనివర్సిటీలను నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చిన మోడీ, జగన్ నాలుగున్నరేళ్లుగా శంకుస్థాపనలతో కాలక్షేపం చేపడుతున్నా జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజల వద్దనే పాలననే ప్రభుత్వానికి ప్రజల చెంతన విద్యాసంస్థలు నెలకొల్పవడం పాలకులకు పట్టదా అని ప్రశ్నించారు. జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర, ఈనెల 8 రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపట్టిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి చలనం లేదన్నారు. అందుకే ఈనెల 24 నుంచి 29 వరకు పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన దీక్షలు, 30న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పెద్ద ఎత్తున భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, శ్రీశాంత్, వెంకటలక్ష్మి, సంధ్య, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విలువిద్య పోటీలను ప్రారంభిస్తున్న డిడి మంగవేణి

క్లస్టర్ లెవెల్ క్రీడలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం క్లస్టర్ లెవెల్లో గిరిజన క్రీడలను డిడి జి.మంగవేణి ప్రారంభించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రీడలను నిరసిస్తున్నామని తెలిపారు. ముందుగా ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలో క్రీడలు నిర్వహించి వాటిలో ఎంపికైన వారిని క్లస్టర్ లెవెల్లో క్రీడలు నిర్వహించామని తెలిపారు. ఈనెల 20న గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడాకారులకు ఎంపికలు చేస్తామన్నారు. ఈ క్లస్టర్ లెవెల్‌లో 25 ఆశ్రమ గురుకుల పాఠశాల నుంచి బాల బాలికలు పాల్గొన్నారు. వాలీబాల్ ఆర్చరీ, జావలింగ్ త్రో తదితర క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చందర్రావు, పీడీలు వెంకట్రావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు

పాఠశాలల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

పాఠశాలల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలు ఉండాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ మండల అధికారులను ఆదేశించారు. పి.ఆమిటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాలను శనివారం పరిశీలించారు. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ కట్టడాల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతుందని, నీటి ఎద్దడి అవకాశాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు సైతం వీటిపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి వనరులు పుష్కలంగా లభించే విధంగా చేయాలని ఆయన సూచించారు. పిఒ వెంట తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సాల్మన్‌రాజు తదితరులు ఉన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతంగా నిర్వహించాలి

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర విజయవంతంగా నిర్వహించాలని పిఒ ఆదేశించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహణ తీరు, ప్రజల భాగస్వామ్యాన్ని పరిశీలించారు. వచ్చే వారం పి.ఆమిటి, కొండవాడ, లక్కగూడ, చేముడుగూడ తదితర గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహణ ఏర్పాట్లను శనివారం పిఒ పరిశీలించారు. ప్రజలకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సభలపై ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, అన్ని బ్యాంకుల శాఖలు విధిగా పాల్గొనాలని ఆయన స్పష్టం చేశారు.

పథకాలపై అవగాహన పొందాలి

పథకాల గూర్చి ప్రజలు అవగాహన పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మండలంలోని కుక్కిడి, దుమ్మంగి పంచాయతీలలో శనివారం జరిగింది. ఈ పిఒ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు, ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగు నీరును పొందేందుకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్వయం సహాయక బృందాలను ప్రజలకు అవగాహన కల్పించడం లక్ష్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి ఉండి ఇంకా నమోదు కాకపోతే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో వెంటనే నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రచార రథం రోజుకు రెండు గ్రామ పంచాయతీల్లో పర్యటించి అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రచార వాహనంలో కళా బృందాలు పథకాలపై వివిధ కళా రూపాల ద్వారా ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్‌బ్యాగుల తయారీ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోన పంచాయితీ, అడ్డూరు వలసలో శనివారం సర్పంచ్ కె.రామస్వామి చేతుల మీదుగా స్వయం సహాయక బృందాలకు చెందిన గిరిజన మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణా కార్యక్రమం వారికి యూనిఫాంలు అందించి ప్రారంభించారు. స్టేట్‌బ్యాంకు, గ్రామీణ యువత స్వయంఉపాధి శిక్షణ విభాగం, ఐకెపి ఆధ్వర్యం జరిగే ఈ శిక్షణ 13రోజులు పాటు ఉంటుంది. గోనెసంచుల తయారీ, మార్కెటింగ్, ముడిసరుకు కొనుగోలు, వంటివాటిపై శిక్షణ పొందిన తర్వాత, బ్యాంకుల ద్వారా రుణాలు అందించే ఏర్పాటు ఉంటుందని, శిక్షకుడు, సిసిలు తెలిపారు.

టెన్త్‌లో విజయ ఢంకా మోగించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు విజయ దుందుభి మోగించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత అన్నారు. శనివారం స్థానిక కెజిబివి పాఠశాలను ఆమె సందర్శించారు. ఇష్టంతో చదివితే విషయ అవగాహన సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆసక్తి, బోధన, అభ్యసన తదితర అంశాలను పరిశీలించారు. తరగతులు ఏకాగ్రతతో వినాలని, సందేహాలు వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో గత ఏడాది జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ ఏడాది కూడా మనమే ప్రథమ స్థానంలో ఉండాలని, పదో తరగతి విద్యార్థులు చక్కగా చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని పిలుపునిచ్చారు. మనం బాగా చదివితే మన భవిష్యత్తు బాగుంటుందన్నారు. తెలివితేటలు అందరికీ సమానమేనని ఏకాగ్రతతో చదివిన వారు మంచి విజయాలు సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిఎఫ్ డబ్బులు ఏమయ్యాయి? : యుటిఎఫ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయుల జెడ్‌పి పిఎఫ్ మినహాయింపు డబ్బులు ఏమయ్యాయి? ఎక్కడ ఉన్నాయో తేల్చాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ట్రజరీ అధికారులకు వినతిని అందజేశారు. అనంతరం మురళీమోహనరావు మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత సెప్టెంబరు 2022 వరకు పిఎఫ్ సెక్షన్‌కు మినహాయింపులు క్రెడిట్ అయ్యాయని, కానీ 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకూ పిఎఫ్ సెక్షనకు క్రెడిట్ కాలేదన్నారు. ఈ విషయమై జిల్లా పరిషత్ వారిని అడిగితే డిప్యూటీ సిఇఒ లాగిన్లోకి మీ పిఎఫ్ మినహాయింపులు రావాలని కానీ లాగిన్లో కనబడలేదని అన్నారు. జిల్లా ట్రజరీ అధికారులను, సబ్ ట్రెజరీ అధికారులను సంప్రదించగా ఆన్లైన్‌లోనే ప్రక్రియ జరుగుతుందని మా చేతుల్లో ఏమీ లేదంటున్నారన్నారు. ఈ విషయమై రాష్ట్ర ఖజానా అధికారులకు ఈనెల 8న లేఖ పంపించామని జిల్లా ట్రజరి అధికారులు చెప్పారని తెలిపారు. ఉపాధ్యాయుల కోట్లాది రూపాయల పిఎఫ్ డబ్బులు సమస్య వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా ట్రెజర్ అధికారులు స్పందిస్తూ సుమారు 1500 మంది టీచర్లకు సంబంధించిన డబ్బులు గూర్చి రాష్ట్ర ఖజానా అదికారులకు లేఖ రాశామని, అక్కడ నుండి వచ్చిన సమాచారం మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతిని అందజేసిన వారిలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ఉన్నారు.

వైసిపి పాలనకు నిలువుటద్దాలు రోడ్లపై గుంతలు

గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదంటూ టిడిపి, జనసేన నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్రంలో అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందనేదానికి ఆనవాళ్లు రోడ్లపై గుంతలని టిడిపి, వైసిపి నాయకులు ఎద్దేవా చేశారు. శనివారం టిడిపి, జనసేన ఆధ్వర్యాన మండలంలోని వెంకంపేటఘోరీల కూడలిలో పట్టణంలోని పాతబస్టాండులో రహదారి గుంతల దగ్గర నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, జనసేన కన్వీనర్ ఎ.మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో జరిగింది. రూ.10లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చిన సిఎం జగన్‌మోహనరెడ్డి ప్రాణాంతకంగా మారిన రహదారి గుంతలను కప్పే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. గుంతలుపడిన రహదారులతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు బోను చంద్రమౌళి, గొరజాన చంద్రమౌళి, పట్టణ అధ్యక్షులు జి.రవికుమార్, కౌన్సిలర్లు కెనారాయణరావు, టివెంకటరావు, కోల మధుసరిత, జనసేన నాయకులు చందక అనిల్‌కుమార్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట-ఇప్పులవలస గ్రామాల మధ్య పాడైపోయిన రోడ్డును బాగు చేయాలని టిడిపి, జనసేన నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణునాయుడు, నాయకులు బొమ్మనేని లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం :గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేదంటూ మండలంలోని మండ గ్రామ సమీపంలో గుంతలు పడ్డ రాష్ట్ర రహదారి వద్ద వద్ద తెలుగుదేశం-జనసేన పార్టీల నాయకులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ వైసిపి నాలుగున్నరేళ్లలో రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు,అరకు పార్లమెంటు ఎస్టీసెల్ కార్య నిర్వాహక కార్యదర్శి తాడంగి రామారావు, క్లస్టర్ ఫోర్ వెంకటరావు, లుంబేసు గ్రామ కమిటీల అధ్యక్షులు తోయక కామేశ్వరరావు, కొండలరావు కొండవాడ గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్, బూత్ ఇంచార్జ్ మండంగి త్రినాద్ దొర, టిడిపి, జనసేన నాయకులు హాజరయ్యారు.

కొమరాడ : స్థానిక అంతర్ రాష్ట్ర రహదారిపై అధ్వానమైన రోడ్ల దుస్థితిని ప్రజలందరికీ అర్థమయ్యేలా డిజిటల్ క్యాంపెనింగ్ రూపంలో తెలుగుదేశం, జనసేన నాయకులు నిరసన చేపట్టారు. జనసేన మండల అధ్యక్షులు తెంటు శ్రీకర్, తెలుగుదేశం మండల అధ్యక్షులు సేనాపతి ఉదయ్ శేఖర్ పాత్రుడు గోతులు వద్ద నిరసన తెలుపుతూ వైసిపి ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దేవకోటి వెంకటనాయుడు, నంగిరెడ్డి మధుసూదన్‌రావు, గులిపల్లి సుదర్శన్, పొట్నూరు వెంకటనాయుడు, సత్యనారాయణ, జగదీష్, భానుజీ తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పార్వతీపురం నుంచి శ్రీకాకుళం రహదారిలో ఉల్లిభద్ర సమీపాన ఏర్పడ్డ గుంతల వద్ద టిడిపి, జనసేన నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి ఎం.తవిటినాయుడు, అరకు పార్లమెంట్ జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి ఎంబి విజయ అంకుశం. కార్యదర్శి పూర్ణచంద్రరావు. అరకు పార్లమెంట్ బీసీ విభాగం ఉపాధ్యక్షులు అంబటి రాంబాబు, తెలుగు యువత ఉపాధ్యక్షులు కోట సుమన్ భరత్, బచ్చ జగదీష్, ఎం.కృష్ణంనాయుడు, ఎం.నారాయణస్వామి, ఎం.రామారావు, వై.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కురుపాం : టిడిపి -జనసేన ఉమ్మడి సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ కు దారేది అనే కార్యక్రమం స్థానిక ప్రధాన బస్ స్టాండ్ వద్ద ఉన్న గుంతను చూపిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్, జనసేన నాయకులు నేరేడుబిల్లి వంశీ, టిడిపి నాయకులు నందివాడ కృష్ణబాబు, కె.రామరాజు, కర్రి శ్రీను, చంటి, త్రినాథ, రాజేష్, గవరయ్య , విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని సింగిడి వద్ద పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి, జనసేన ఇన్చార్జ్ నిమ్మల నిబ్రహం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రోడ్లు బాగుండాలన్నా రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్ఎస్ ప్రకాశరావు, అంగూరు దశరధనాయుడు, వై.శ్రీనివాస్, కె.రాజారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి-జనసేన నాయకులు

గుమ్మలక్ష్మీపురం : మండలో నిరసన తెలుపుతున్న టిడిపి-జనసేన నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

ప్రతి ధాన్యం గింజా కొనాల్సిందే : జెసి

ప్రజాశక్తి - పాలకొండ

రైతుల దగ్గర ప్రతి గింజ కొనాల్సిందేనని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని సకాలంలో తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్కడే పరీక్షలు జరపాలని సూచించారు. మిల్లర్లు గ్యారంటీలు సమర్పించి ధాన్యం సేకరించాలన్నారు. రైతులకు ఇబ్బంది ఎదురైతే ఉపేక్షించేది లేదని అన్నారు. సమావేశంలో డిఎస్‌ఒ శివప్రసాద్, జిల్లా మేనేజర్ నాయక్, ఆర్‌డిఒ ఎం.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గడగమ్మలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఆశాజ్యోతి, ఎఎన్ఎం వై.రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, పాల్గొన్నారు.

24న సామాజిక సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 24న నిర్వహించనున్న బస్సుయాత్ర ఆవశ్యకతను ప్రజలకు వివరించి విజయవంతం చేయాలని శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేట్ భవనంలో వైసిపి సామాజిక సాధికార బస్సుయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కళావతి ముఖ్యఅతిధులుగా మాట్లాడారు. పాలకొండలో జరగబోవు బస్సు యాత్ర ఏర్పాట్ల కోసం చర్చించారు. పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డులోని నాగవంశం వీధి సమీపంలో బస్సు యాత్ర మీటింగ్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. భారీ జన సమీకరణ చేసి జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో డిసిఎంఎస్ ఛైర్మన్, పాలకొండ నియోజకవర్గ పరిశీలకులు గొండు కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, జడ్పిటిసిలు, జెఎసి కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ నుంచి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ మొదటి వారం నుంచి మండలంలో ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు అన్నారు. మండలంలోని విక్రంపురం, కొమరాడ తదితర రైతు భరోసా కేంద్రాల్లో రైతులు, సిబ్బందితో సమావేశాలు శనివారం ఏర్పాటు చేశారు. మండలంలోని ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండలంలో వరి 10,917 ఎకరాలు సాగైనట్టు ఇ-క్రాప్ చేసినట్లు తెలిపారు. ధాన్యం అంచనా దిగుబడి 17,830 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది మొత్తం మండలంలో 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. 22 మంది టెక్నికల్ సిబ్బందికి, వ్యవసాయ సహాయకులకు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. మండలంలో ఎక్కువగా ఎంటియు 1064 సాగు చేశారని ఈ రకం డిసెంబర్ మొదటివారంలో కోతలు ప్రారంభమవుతాయని, కావున ఆ వారంలో కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి గింజ కొంటామని ఎఒ స్పష్టం చేశారు.

పాలకొండ-వీరఘట్టం నైట్ హాల్ట్ బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

ఈనెల 19 నుండి ఉదయం 4.45 గంటలకు వీరఘట్టం-పాలకొండ పల్లె వెలుగు బస్సు నడపనున్నట్లు పాలకొండ ఆర్టీసి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ బస్సు ప్రతిరోజు రాత్రి 9:30 గంటలకు పాలకొండలో బయలుదేరి వీరఘట్టంకు రానుందని తెలిపారు. బస్సు సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

21న ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 21న స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మేధా సర్వో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు అప్రెంటిస్ డ్రైవ్ ఉంటుందన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, ఎలక్ట్రికల్ ట్రేడుల్లో ఐటిఐలో పాస్ అయిన వారు అర్హులేని తెలిపారు. హైదరాబాదు జీడిమెట్లలో కంపెనీ ఉందని, 18 నుంచి 25 ఏళ్ల వయసు గల పురుషులు అర్హులని తెలిపారు. జీతం రూ.14వేలకు పైగా ఉంటుందని తెలిపారు. ఆసక్తి అభ్యర్థులు హాజరుకావాలని అన్నారు.

అడవులను నాశనం చేసే కేంద్రం మెడలు వంచుదాం

ప్రజాశక్తి - మక్కువ

ప్రధాని మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అడవులను నాశనం చేసేలా చట్టాలను తీసుకువస్తూ ఆదివాసీలకు పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అధిక శాతం కార్పొరేట్లకు మేలు కలిగేలా చట్టాలు తీసుకువస్తున్నారని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఝాన్సీ అన్నారు. శనివారం పనసభద్ర పంచాయతీ పరిధిలోని దుగ్గేరులో కొత్తగా నిర్మించిన ఆదివాసీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భవనాన్ని పేదలంతా కష్టపడి తమ సొంత ఇంటిలా నిర్మించుకున్నారని ఇది దోపిడీకి గురవుతున్న ప్రజలదని ప్రకటించారు. ప్రజలంతా ఏ చైతన్యంతో అయితే ఈ భవనాన్ని నిర్మించుకున్నారో అదే చైతన్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే నూతన అటవీ సంరక్షణ చట్టాలు-2023 వంటివి అడవులను నాశనం చేసే చట్టాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత ఆదివాసీ భవన్ నుంచి ర్యాలీగా మార్కెట్ యార్డ్ వద్ద నిర్వహించే జన్ని తిరుపతి వర్ధంతి సభకు వెళ్లారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వూయక ముత్యాలు అధ్యక్షతన జరిగిన సభలో తాండ్ర అరుణ, దంతులూరి వర్మ, పంచాయితీ ప్రెసిడెంట్ వి. విజయ,పి. శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, పి.అసిరి, గిరిజన సంఘం నాయకులు ఎం.చెంచు చుట్టుపక్కల గ్రామాల పెద్దలు, సాలూరు, పార్వతీపురం మండలాలకు చెందిన ప్రజా సంఘం నాయకులు పాల్గొన్నారు. కళాకారులు ఆద్యంతం పాటలు కళారూపాలు కింద్రి డప్పుల డాన్స్ వంటి వాటితో అలరించారు.

'బడి నుంచి పొలంబడి'

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని జట్టు ప్రకృతి ఆది దేవోభవ ప్రాంగణంలో తోటపల్లి పాఠశాల విద్యార్థులు శనివారం ప్రకృతి వ్యవసాయ పంటల సందర్శన జరిగింది. 'బడి నుండి పొలంబడికి' ప్రాజెక్టులో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షత వహించారు. రకరకాల పంటల మొక్కలు, వాటి పెంపకం విధి విధానాలు నిపుణుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సంబంధిత అవగాహన విద్యార్థులకు ఎంతవరకు ఉందనేది రచయితలు, మేధావులు పరిశీలించి వారికి తగిన సూచనలు అందించారు. ప్రకృతి వ్యవసాయంలో వాడే కషాయాలు, ద్రావణాలు ప్రాము ఖ్యత తయారీ విధానం స్వయంగా చూసి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై జరిగిన వ్యాస రచన పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. కార్యక్రమంలో సిలబస్ డవలప్మెంట్ కన్సల్టెంట్ టి. శివాజీ, ప్రముఖ రచయితలు రౌతు వాసుదేవరావు, బెహరా ఉమామహేశ్వరరావు, లంక వెంకట స్వామి, టి.శివకేశవరావు, తోటపల్లి హైస్కూల్ ఇంచార్జి జి.రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, జట్టు డైరెక్టర్ ప్రహరాజ్, కో-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కేశఖండన రుసుం పెంపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి కోదండ రామస్వామి ఆలయంలో ప్రస్తుతం కేశఖండన రుసుంను రూ.25 నుండి రూ 4కు పెంచినట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వివి సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రుసుం ఈనెల 19నుంచే అమల్లోకివస్తుందన్నారు. కావున ఇందుకు భక్తులు సహకరించాలని కోరారు. అలాగే కార్తీక్ మాసం ప్రారంభమైన శనివారం రోజున ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దళారులపాలు కాకూడదు

- తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎంపిపి పద్మావతి

ప్రజాశక్తి - కురుపాం

వరి కోతలకు రైతులు సిద్ధమవుతున్న సందర్భంగా ముందస్తుగా వ్యవసాయ అధికారులు ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిపి శెట్టి పద్మావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఎంపిడిఒ వివి శివరామప్ప ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి శెట్టి పద్మావతి మాట్లాడుతూ ఎన్ని గోనె సంచులైతే సరిపోతున్నాయో ముందస్తుగా ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేసుకుని రైతు ద్వారా పండిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని కోరారు. అలాగే కొనుగోలు కేంద్రం ద్వారా కొన్న పంటల ధరలు ప్రతి రైతుకు తెలిసేలా అవగాహన కల్పించే బాధ్యత వ్యవసాయ శాఖ సిబ్బంది తీసుకోవాలని సూచించారు. ఎంఇఒ మాట్లాడుతున్న సమయంలో మరిపల్లి సర్పంచ్ బి.రాజయ్య మాట్లాడుతూ తమ గ్రామంలో గతంలో ఎయిడెడ్ పాఠశాల ఉండేదని, అది పూర్తిగా మూసివేశారని, కావున కొత్తగా పాఠశాల మంజూరు చేయాలని కోరారు. రస్తాకుంటుబాయి సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉందని ఏమైనా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని కావున ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుండి మార్చాలని కోరారు. పెద్దగొత్తిలి ఎంపిటిసి సభ్యులు వి.కృష్ణకుమారి మాట్లాడుతూ పెదగొత్తిలి పాఠశాలకు నాడు నాడు నిధులు మంజూరై పనులు మధ్యలో ఆగిపోయాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిధులు మంజూరై పాఠశాల భవనాలు నిర్మాణంలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, జెడ్‌పిటిసి జి.సుజాత, జెడ్‌పి, మండల ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, షేక్ జిలాని, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

పార్వతీపురంరూరల్ : మండలంలో వరికోతలు ప్రారంభమైన దృష్ట్యా రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా గోనెసంచులు ముందస్తుగా అందిండమే కాకుండా కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి అధికారులను డిమాండ్ చేశారు. శనివారం స్థానిక మండల సమావేశ భవనంలో ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మండలంలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతు సమస్యలపై అధికారులను నిలదీశారు. సమావేశంలో ముందుగా ఎంపిడిఒ అకిబ్‌జావేద్ సమావేశపు ఎజండాను, మూడుమాసాలుగా మండల ప్రగతిని వివరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అభివృద్ధిని సమీక్షించారు. మండల వ్యవసాయ అధికారి అశోక్ ఖరీఫ్ వివరాలు, ఇ-క్రాప్, ఈకెవైసిల గురించి వివరిస్తుండగా రావికొన సర్పంచ్ రామస్వామి మండలంలో రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు గురించి నిలదీశారు. అనంతరం హౌసింగ్ ఎఇ చిరంజీవులు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో 2309 ఇళ్లకు గానూ 418 ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, 1371 నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వీటిలో 844 బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయని తెలిపారు. అలాగే మిగతా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పనితీరును గణంకాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎఎంసి ఛైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాధరావు, బంకురు రవికుమార్, ఒఇపిఆర్‌డి కృష్ణుడు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరయ్యారు.

విద్యార్థులతో డిఎల్‌డిఒ ముఖాముఖి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రత్యేకాధికారి వి.గోపాలకృష్ణ శనివారం ముఖాముఖి నిర్వహించారు. మీ లక్ష్యమేమిటి? బాగా చదువుతున్నారా? అని విద్యార్థులను ప్రశ్నించారు. ఎంతమంది పదో తరగతి చదువుతున్నారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారా తదితర అంశాలపై ఆరా తీశారు. పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతికి 23 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇందులో 16 మంది విద్యార్థుల వరకు 60 శాతం పైబడి చదువులో మెరుగ్గా ఉన్నట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. మిగిలిన ఆరుగురు విద్యార్థులు వెనుకబడి ఉన్నారని వారికోసం ఉదయం, మధ్యాహ్నం ప్రత్యేక తరగతులు నిర్వహించమని ఉపాధ్యాయులకు ఆదేశించారు. శత శాతం ఉత్తీర్ణతతో పాటు అందరూ అత్యధిక మార్కులతో పాటు ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. శనివారం ఆరుగురు విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోవడంతో వారి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ఒక విద్యార్థి రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరు కాకపోవడంతో ఏ కారణం చేత పాఠశాలకు హాజరు కాలేదని, ఆ గ్రామానికి వెళ్లి ఆమె వివరాలు నమోదు చేసి తమకు సమాచారం అందించాలని నడుకూరు గ్రామ సచివాలయ కార్యదర్శి మధును ఆదేశించారు. అలాగే పదో తరగతి విద్యార్థులతో పాటు తొమ్మిదో తరగతి విద్యార్థులకు కూడా ఇంటరాక్ట్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉండడం వల్ల సంతృప్తికరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు టి.ప్రశాంతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఓటరుగా నమోదవ్వండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డిఒ హేమలత

యువత ఓటరుగా నమోదై ఎన్నికల్లో ఆదర్శంగా నిలవాలని ఆర్‌డిఒ కె.హేమలత పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ళు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు అర్హులన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం జరుగుతుందని, 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన యువత ఓటరుగా నమోదుకు అర్హులన్నారు. యువత బాధ్యతాయుతంగా ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో క్రియాశీలంగా ఆలోచించాలని ఆమె సూచించారు. మంచి సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని ఆమె కోరారు. యువత ఓటు హక్కు కలిగి ఉండటం ముఖ్యమని వారే బాధ్యతాయుతమైన పౌరులను అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, నమోదు కాని వారికి తెలియజేయాలని చెప్పారు. డిసెంబరు 2,3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను బూత్ స్థాయిలో చేపట్టడం జరుగుతుందని ఆమె వివరించారు. అక్టోబరు 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామన్నారు. ముసాయిదా ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ స్థాయి అధికారులు ఉంటారని ఆమె పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారుల వద్ద ఫారం - 6, 7, 8 అందుబాటులో ఉంటాయని ఆమె చెప్పారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చలపతి రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి విద్యార్థి తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకొని మంచి నాయకత్వానికి ఆధారం అయ్యేలా ఉండాలని తహశీల్దార్ జె.రాములమ్మ అన్నారు. శనివారం ఆమె స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అవగాహనలో మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ వరం మాట్లాడుతూ, ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన గొప్ప సదవకాశమని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు హక్కు అని అన్నారు. ఈ మేరకు ప్రతి విద్యార్థి తమకు ఉన్న ఓటు హక్కును వినియోగించుకుని మంచి విలువైన నాయకున్ని ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాథ, అధ్యాపకులు శ్రీ లక్ష్మి, కల్పన, శ్రీవాణి, తులసి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో ఎన్ఎస్ఎస్, హ్యూమానిటీస్ స్థానిక మండల రెవెన్యూ అధికారుల బృందం ఆధ్వర్యంలో కాలేజీ ప్రిన్సిపల్ పైలా శంకర రావు అధ్యక్షతన ఓటు నమోదు, ప్రాధాన్యత అన్న అంశంపై అవగాహన జరిగింది. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది బి.శ్రీనివాసరావు , డి.టి, బిఎల్ నరసింహులు,. సీనియర్ అసిస్టెంట్ డి.శేఖర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కోశాధికారి వెంకటరమణ

20, 21న ఆప్కాస్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీల్లో ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ తలపెట్టిన ఈనెల 20న ప్రదర్శనలు, 21న కలెక్టరేట్ వద్ద వంటావార్పు కార్యక్రమాల్లో కార్మికులంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని, చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వానికి డిమాండ్ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, మామిడి శివ, బంగారి రాజేష్, పాపులమ్మ, ఇప్పలమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20,21తేదీల్లో నిర్వహించనున్న నిరసన ప్రదర్శన, ధర్నా లను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాధ్యక్షులు టి.రాముడు, సహాయ కార్యదర్శి టి.శంకరరావు, మహిళా కన్వీనర్ టి.ఇందు కోరారు. ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారి ఎ.ధర్మారావు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినిలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ చిత్రలేఖనంలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమయంలో బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

గరుగుబిల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపల్ వెంకటరత్నం, వి.రాజేశ్వరి, ఒకేషనల్ జి.అప్పలనరసమ్మ, తెలుగు పండిట్, స్థానిక గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదన్ రావు పాల్గొన్నారు.

సీతంపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయం అధికారి గణేష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ శివకుమార్ ఈ పోటీలను ప్రారంభించారు. డిజిటల్ లైబ్రరీ మహా విప్లవం అన్న అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రంథాలయ సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఆటలు పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కుర్చీలాట ఆడించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తారని గ్రంథాలయ అధికారి వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భామిని : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయాధికారి కె. సునీత ఆధ్వర్యంలో గ్రంథాలయాలు, వాటి ప్రాముఖ్యత అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొనడం అలవాటుగా, అవి మన ప్రతిభను పదునుపెడతాయని పంచాయతీ కార్యదర్శి వి.విశ్వేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, కె.రాధా, పి.శారద పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను గ్రంథాలయ నిర్వాహకులు డి.సుకన్య నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు చివర రోజున బహుమతి ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతీపురం : చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినిలు

వీరఘట్టం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్రీడా పరీక్ష పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. క్రీడలపై వచ్చే లాభాలు వాటి ఆవశ్యకతపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. క్రీడ పరీక్షలకు జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల, మహర్షి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, బి.విజయలక్ష్మి, రామకృష్ణ, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించగా, వెంకమ్మ పేట హై స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల హై స్కూల్, పెద కాపు వీది హై స్కూల్, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి.గణేస్ బాబు, ఉపాధ్యాయులు కామేశ్వరమ్మ, నాగమణి, నాయుడు, భారతి, రత్నం ,ఉపాధ్యాయుల పాల్గొన్నారు. ఆదివారం ముగ్గులు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కులగణన పర్యవేక్షణ అధికారులు వీరే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 27 నుంచి నిర్వహించనున్న కుల గణన సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు సూపర్వైజింగ్ అధికారులు నియమించినట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తలవరం, నీలా నగరం, పనస నందివాడ, తెట్టంగి గ్రామ సచివాలయాలను ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్, ఇఒపిఆర్‌డి టిఆర్‌ఎం నాయుడు చలివేంద్రి, దశమంతపురం, నర్సిపురం, చిన్నగోరకాలనీలను, ఉప తహశీల్దార్ బి.కుమారస్వామి, ఎపిఒ జి.సత్యంనాయుడు కంబర, కిమ్మీ, నడిమికెళ్ల, చిట్టిపూడి వలసలను, ఎపిఎం బి.శివున్నాయుడు నడుకూరు, చిదిమి, వండువ, బిటివాడ సచివాలయాలను, మండల వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య వీరఘట్టం 1,2,3,4 సచివాలయంలో జరిగే సర్వేను పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

పాచిపెంట : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్ అధ్యక్షతన కులగణనపై సచివాలయ ఉద్యోగస్తులకు శిక్షణ ఇచ్చారు. సర్వే ఎలా నిర్వహిస్తారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ముందుగా సచివాలయ ఉద్యోగి, వాలంటీరు డోర్ టు డోర్ సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఈ సర్వేలో పాల్గొంటూ సమాచారం అందించేలా తోడ్పాటు అందించాలని తెలిపారు. కుల గణనలో ప్రజలు చెప్పే కుల విషయాలు ఎటువంటి ఆధారాలు చూపనవసరం లేదని, కులగణనకు, కులధ్రువీకరణ పత్రానికి ఎటువంటి సంబంధం లేదని, అలాగే కుల గణనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

పాలకొండ: ఈ నెల 27న జరగనున్న కుల గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.త్రినాధ్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయలంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యమ్రకానికి కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీస్, ఎఎస్‌ఒలు హాజరుకావాల్సి ఉందన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం పై పిఇటిలు ఎంఇఒలతో సమీక్షించారు. అలాగే వెల్ఫేర్ అసిస్టెంట్లతో విద్యా దీవెన పథకం గురించి తెలిపారు.. ఈ సమావేశంలో ఈవోపిఆర్‌డి భాస్కరరావు పాల్గొన్నారు.

పక్కాగా ప్రజారోగ్య కార్యక్రమాలు : డిఐఒ

ప్రజాశక్తి - మక్కువ

పిల్లల ఆరోగ్య కార్యక్రమాలను పక్కగా నిర్వహించి, వారి ఆరోగ్య వృద్ధికి కృషి చేయాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలో మక్కువ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) పరిధిలో గ్రామాలను శనివారం సందర్శించారు. ఐదేళ్లలోపు పిల్లలకు సంబంధించిన ఆరోగ్య కార్యక్రమాలను వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలన్నారు. కన్నంపేట, శంబర గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లిదండ్రులకు నిర్వహించిన న్యుమోనియా తదితర శ్వాస సంబంధమైన వ్యాధుల నియంత్రణకు సంబంధించిన సాన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. అక్కడ టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేసి ఆర్సిహెచ్ రికార్డులు, టీకా కార్డులు పరిశీలించారు. పిల్లల్లో న్యుమోనియా నియంత్రణలో కీలకమైన పిసివి వ్యాక్సిన్ మూడు డోసులను 6,14 వారాల్లో, 9నెలలో తప్పక వేయాలని సిబ్బందిని ఆదేశించారు. టీకా ఆన్లైన్ విధానం యూవిన్ పోర్టల్‌ను పరిశీలించారు. జ్వరాలను గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి క్షేత్ర స్థాయిలో సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ జి.హరికృష్ణ, ఎంవి కిరణ్‌కుమార్, డాక్టర్ ఎం.నిఖిల, సూపర్ వైజర్లు వెంకటరత్నం, సరస్వతి, జయగౌడ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రమాణాలను పాటించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు పంపాలని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సిబ్బందికి, గ్రామ వ్యవసాయ సహాయకులకు సివిల్ సప్లై సాంకేతిక శిక్షకులు తులసి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుపై శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయమై రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సరిపడా గోనెసంచులు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచారని తెలిపారు. శిక్షకులు తులసి మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17శాతం లోపు ఉండాలని, మట్టి పిల్లలు, రాళ్లు ఒక్క శాతం లోపల ఉండాలని, తొలగింజలు, చెత్త ఒక్క శాతం లోపల మాత్రమే ఉండాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ హేమంత్ తేమ శాతం యంత్రాల పనితీరుపై శిక్షణ ఇచ్చారు. టిసిఎస్ నుంచి వచ్చిన ఆనంద్ కొనుగోలు సిబ్బందికి గోనెసంచులు ఎంట్రీ ధాన్యం బస్తాల ఎంట్రీ ట్రక్‌షీట్ తయారు చేయడం ఎఫ్‌టిఒ తయారు వంటి విషయాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలం పెదబోగిల గ్రామ రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ ఆధ్వర్యాన విఎఎలకు, టిఎలకు, డిఇఒలకు శిక్షణ ఇచ్చారు. వీరికి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ టెక్నికల్ అసిస్టెంట్లు జి.వనిత, పి.రాజశేఖర్, సిఎస్‌సి ఎ.కల్యాణ్ శిక్షణ ఇచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని రాజువలసకు చెందిన యాళ్ల కిరణ్ (34), గంట నరేష్ రావివలస నుంచి పార్వతీపురం వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా నరేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనానికి సమాచారమివ్వగా క్షతగాత్రుడ్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కిరణ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన మృతితో భార్య ఝాన్సీ, తల్లిదండ్రులు రవణమ్మ, అప్పలనాయుడు కన్నీరుమున్నీరై రోధిస్తున్నారు.